అప్రమత్తతే శ్రీరామ రక్ష



2



2

ఘనంగా జాతీయ దినోత్సవం



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## ధాన్యం నిల్వలకు గోడౌన్లను సిద్ధం చేయాలి



**అక్షర టుడే ఇందూరు:** వరి ధాన్యాన్ని నిల్వ చేసేందుకు వీలుగా గోడౌన్లను గుర్తించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ లో శనివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సమావేశం నిర్వహించారు. ఒక్కో శాఖ వారిగా అభివృద్ధి పనుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. లేవి అందించడంలో విఫలమైన 57 మంది డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి రూ.276 కోట్లు రికవరీ చేసేందుకు నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు.



## కుల మతాలకతీతంగా కలిసి ఉండాలి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రతిఒక్కరూ కుల మతాలకతీతంగా కలిసి ఉండాలని మాజీ మేయర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ నుంచి పాత కలెక్టరేట్ మైదానం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు లు అన్ని మతాల వాళ్లు కలిసి ఉంటున్నారని గుర్తు చేశారు. కొందరు వ్యక్తులు ఇటీవల మత చిచ్చు రేపి విడదీయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్‌లో అన్ని మతాలు కులాల వారు ఉన్నారని.. అందరూ భారతీయులేనన్నారు. ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా.. నగరవాసులు ఐక్యతతో ఉంటారన్నారు. కార్యక్రమంలో అన్ని మతాల పెద్దలు, కుల సంఘాలు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగిసిన రెండు రోజుల జాతీయ సెమినార్




**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ది నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 ఏ ట్రాన్స్‌ఫర్మేటివ్ షిఫ్ట్ ఇన్ ఇండియా ఎడ్యుకేషన్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శనివారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ నాయుడు అశోక్, తెయూ ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నాయుడు అశోక్ మాట్లాడుతూ.. ఎన్ఈపీ 2020 కేవలం ఒక విద్యా విధానం మాత్రమే కాదని, ఇది భారతీయ విద్యా వ్యవస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే ఒక మార్గదర్శి అన్నారు. ముఖ్యంగా గాంధీజీ కలలుగన్న 'నయీ తాలిం' అనుభవపూర్వక అభ్యాసం ఛాయలు ఈ విధానంలో స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచీకరణ కాలంలో మన మూలాలను మరిచిపోకుండా, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. మాతృభాషలో విద్యాబోధన, వృత్తి విద్యా కోర్సుల అనుసంధానం ద్వారా విద్యార్థులు స్వయం సమృద్ధి సాధించవచ్చన్నారు. అనంతరం సెమినార్ కన్వీనర్ నివేదికను డాక్టర్ కె. కిష్టయ్య రెండు రోజుల చర్చల సారాంశాన్ని నివేదిక రూపంలో సమర్పించారు. నైపుణ్యాభివృద్ధిలో భాగంగా కళాశాల విద్యార్థులు తయారు చేసిన వాటిలో మహిళా సాధికారిక విభాగం నుంచి జ్యూట్ బ్యాగులు, రసాయన శాస్త్ర విభాగం నుంచి హోమ్ నీడ్స్, మత్స్య శాస్త్ర విభాగం నుంచి ఎక్వేరియం అతిథులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దే ఎఫ్ఐఆర్

**నెల రోజుల్లో 15 కేసుల నమోదు**

**సత్ఫలితాన్నిస్తున్న సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్ విధానం**

**బాధితులకు పోలీసుల భరోసా**




**బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలకు పూనుకుంటోంది. ఇప్పటికే జీరో ఎఫ్ఐఆర్ విధానం ద్వారా ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేసే వెసులుబాటు పోలీసు శాఖ కల్పించగా వందల కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా పోలీసులే ఇంటివద్దకు వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే దిశగా సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్ విధానాన్ని తీసుకువచ్చారు. ఈ విధానం సత్ఫలితాన్నిస్తోంది.**

**—అక్షరటుడే, కామారెడ్డి**

జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు మూడు సబ్ డివిజన్ పోలీసు కార్యాలయాలు, 8 సర్కిల్ కార్యాలయాలు, 25 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు షీ టీమ్స్, పెట్రోలింగ్, గ్రామ, వార్డు పోలీసింగ్, బ్లూ కోల్ట్ పేరుతో ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. ప్రజలకు మరింతగా పోలీసుల సేవలు అందాలన్న ఉద్దేశంతో సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఈ విధానం ద్వారా పోలీస్ స్టేషన్‌కు రాలేని బాధితుల ఇంటివద్దే ఫిర్యాదు తీసుకుని అక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. దీంతో బాధితులకు భరోసా కలగనుంది.

### విజయవంతంగా ఎఫ్ఐఆర్ నమోదు

విక్టిమ్/సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్ విధానాన్ని గత నెల 20న రాష్ట్ర పోలీసు శాఖ ప్రారంభించింది. మరుసటి రోజు ఉమ్మడి జిల్లాలో పోలీసు ఉన్నతాధికారులు సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై ఈ విధానంపై అవగాహన కల్పించారు. ఫిర్యాదు తీసుకోవడం, కేసు నమోదు చేసి బాధితులకు ఎఫ్ఐఆర్ అందజేయడం వంటి వివరాలను వెల్లడించారు. దాంతో ఉమ్మడి జిల్లాలో ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోంది.

### మంచి స్పందన

సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ విధానం ద్వారా ఉమ్మడి జిల్లాలో భారీగా కేసులు నమోదవుతున్నాయి. నిజామాబాద్ జిల్లలో ఇప్పటివరకు 19 కేసులు నమోదు కాగా కామారెడ్డి జిల్లాలో 15 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో గాంధారి మండలం హేమ్లా నాయక్ తండాలో 14 మేకలు దొంగతనం జరిగిన కేసులో మొట్టమొదటి సారిగా బాధితుడి ఇంటివద్దే కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ అందజేశారు. ఆ తర్వాత దోమకొండలో చైన్ స్నాచింగ్, లింగంపేటలో రోడ్డు ప్రమాదం కేసు లాంటి వాటిలో ఇంటివద్దనే కేసు నమోదు చేశారు.

### బాధితులకు తగ్గనున్న శ్రమ

కొన్ని కేసుల్లో బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితులు ఉంటాయి. ముఖ్యంగా అత్యాచారం, దాడులు, కిడ్నాప్ లాంటి కేసులలో బాధితులు భయంతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కి ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేసేవారు. ప్రస్తుత విధానంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే పోలీసులే ఇంటికి వచ్చి బాధితుల వద్ద ఫిర్యాదు తీసుకుని తక్షణమే కేసు నమోదు చేస్తున్నారు. దీంతో బాధితుల్లో భరోసా నింపడంతో పాటు వారిలో ఉన్న భయం పోవడం, పోలీసు స్టేషన్ కు వెళ్లే శ్రమ తగ్గుతుంది.

### వీటికి వర్తిస్తుంది..

ఇంటివద్దనే ఎఫ్ఐఆర్ విధానం అన్ని కేసులకు వర్తింపజేయడం లేదు. పోక్సో, అత్యాచారం, హత్యలు, దాడులు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, రాబరీలు లాంటి కేసులలో మాత్రమే ఇంటివద్ద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో ఉండే వారికి ఈ విధానం ఉపయోగపడనుంది.

### పోలీసులపై విశ్వాసం పెరుగుతోంది



పోలీసులు ప్రజల కోసమే అనే భావన కల్పించేందుకు సిటిజెన్ సెంట్రిక్ పోలీసింగ్ విధానాన్ని పోలీసు శాఖ అమలు చేస్తోంది. ఈ విధానం ద్వారా ప్రజలకు పోలీసులపై విశ్వాసం పెరుగుతోంది. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం కష్టమయ్యేది. ఫలితంగా ఎన్నో కేసులు ఫిర్యాదు దశలోనే ఆగిపోయేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. పోలీసులే స్వయంగా వెళ్లి ఫిర్యాదులు స్వీకరించడంతో చట్టపరమైన రక్షణ అందుబాటులోకి వచ్చింది. ప్రజల నుంచి సైతం విశేష స్పందన లభిస్తోంది. **– ఎస్పీ రాజేష్ చంద్ర, కామారెడ్డి**

## అందరి సహకారంతో మున్సిపల్ అభివృద్ధి




**అక్షరటుడే, ఆర్మూర్:** అందరి సహాయసహకారాలతో ఆర్మూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు ఎజెండా అంశాలపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కాట్‌పల్లి వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణా తరగతులు




**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని అన్ని గ్రామాల వార్డు సభ్యులకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయి. కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలోని ముఖ్యాంశాలు, గ్రామపంచాయతీ పరిపాలనా వ్యవస్థ, ఉపాధిహామీ చట్టం తదితర అంశాలపై శిక్షణాధికారులు భరత్ స్వరూప్, శ్రీకాంత్, ప్రవీణ్, సురేష్ పాల్గొని వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి, ఎంపీవో గంగ మోహన్, సూపరింటెండెంట్ రమణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభకు అధికారుల డుమ్మా




**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోల్కంపేటలో శనివారం నిర్వహించిన గ్రామసభకు అధికారులు హాజరు కాకపోవడంతో సర్పంచ్ రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె సమస్యలు అధికారులకు పట్టనట్టు వ్యవహరించడం సరికాదని గ్రామ సభకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. గ్రామంలో ట్రేడింగ్ లైసెన్స్‌లను పునరుద్ధరించాలని, చికెన్ వ్యర్థాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని పరిష్కరించేందుకు పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కార్యదర్శి అశ్వక్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లండన్‌లో నిజామాబాద్ విద్యార్థి మృతి



**అక్షరటుడే, ఇందూరు :** ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లిన జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు అక్కడ మృతి చెందాడు. అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చనిపోయాడు. నగరంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన కామినేని సాయిశ్రీకర్(26) లండన్‌లో ఎంఎస్ చదవడానికి వెళ్లాడు. అక్కడ చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. లండన్‌లోని క్రాయ్డన్ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో అతడు ఉంటున్న నివాసంలో మంగళవారం రాత్రి (ఫిబ్రవరి 24) భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కామినేని సాయి శ్రీకర్ (26) మూడు రోజుల పాటు చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడు. అగ్ని ప్రమాదంలో సాయి శ్రీకర్‌తో పాటు నివాసం ఉంటున్న ఏపీలోని కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గొంతి అభిషేక్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ శ్రీకర్ ఆస్పత్రిలో చనిపోయాడు. మరో రూమ్‌మేట్ గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా శ్రీకర్ మరణ వార్త తెలియడంతో ఆయన తల్లిదండ్రులు కామినేని ఆంజనేయ ప్రసాద్, పోకల రేణుక గుండెలవిసేలా రోదిస్తున్నారు. శ్రీనగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రమాదవశాత్తు కళాశాల రికార్డ్ అసిస్టెంట్ మృతి

**అక్షరటుడ, బాన్సువాడ:** పట్టణంలో విషాద ఘటన చోటుచేసుకుంది. బాన్సువాడ ఎస్ఆర్ఎన్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న రికార్డ్ అసిస్టెంట్ షేక్ అహ్మద్ (49) కళాశాల రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. నస్రుల్లాబాద్ ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. అహ్మద్ ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇంటి వద్ద తరచూ కళ్లు తిరిగి పడిపోయేవాడు. ఇదే క్రమంలో శనివారం కళాశాల రెండో అంతస్తులో ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కళ్లు తిరిగి పడి మృతి చెందాడు. భార్య గౌసియా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# రాష్ట్రంలో ఒవైసీ బ్రదర్స్ చేతిలో హోంశాఖ: ఏలేటి



**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడి తప్పాయని, హోంశాఖను ఒవైసీ బ్రదర్స్ చేతిలో పెట్టారని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కామారెడ్డి ఎమ్మెల్యే నివాసంలో శనివారం బీజేఎల్పీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కామారెడ్డిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడి హేయనీయమన్నారు. ఎమ్మెల్యేకే ఈ పరిస్థితి ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిపై గెలిచిన ఎమ్మెల్యేకు సెక్యూరిటీ ఇవ్వకుండా కాంగ్రెస్ గుండాల హత్యాయత్నం చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేపై హత్యాయత్నానికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై కేసు నమోదు చేయకుండా బీజేపీ కార్యకర్తలపై దాడిచేసి అరెస్ట్ చేయడం కక్షసాధింపు చర్యలో భాగమేనన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు గతి తప్పాయని, బాన్సువాడ, నాగర్ కర్నూల్, నిర్మల్ ఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో హోంశాఖ మంత్రి లేడని, సీఎం దగ్గరే ఆ శాఖ ఉందని, వీటన్నింటికి సీఎం రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

### బాన్సువాడకు వెళ్తున్న ఎమ్మెల్యేల అరెస్ట్..

బాన్సువాడలో ఇటీవల జరిగిన సంఘటనల నేపథ్యంలో బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు సదాశివనగర్ మండలం పద్మాజీవాడ ఎక్స్‌రోడ్ వద్ద పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. కామారెడ్డిలో బీజేఎల్పీ సమావేశం అనంతరం బాన్సువాడకు బయలుదేరిన బీజేపీ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. బాన్సువాడ తెలంగాణలోనే ఉందా.. లేక ఇతర దేశంలో ఉందా అని ప్రశ్నించారు. తమను ఎందుకు అడ్డుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణలో మరో నిజాం పాలన సాగుతుందంటూ మండిపడ్డారు. బాన్సువాడలో హిందువుల మీద అఘాయిత్యాలు, లాఠీఛార్జీ, యువతపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమే..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమేనని జిల్లా న్యాయమూర్తి భరత లక్ష్మి పేర్కొన్నారు. పోలీసు శాఖలో 42ఏళ్లుగా సేవలందించిన ఆర్మూర్ ఎస్సై ఏలేటి ఇంద్రకరణ్ రెడ్డి పదవీవిరమణ కార్యక్రమానికి సీపీ సాయిచైతన్యతో కలిసి హాజరయ్యారు. పోలీస్ శాఖలో అత్యంత పనిఒత్తిడి ఉన్నప్పటికీ ప్రతి సమస్యను సవాలుగా స్వీకరిస్తూ రిమార్క్ లేకుండా ఇంద్రకరణ్ రెడ్డి పనిచేశారని జడ్జి అన్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ శాఖలో రిమార్క్ లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ఏసీపీలు, ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ బాబు, సతీష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఆర్ఎస్ఎస్ నగర శాఖల సంగమం

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఇందూరు నగర శాఖల సంగమం నిర్వహిస్తున్నట్లు నగర కార్యవాహ అరుగుల సత్యం తెలిపారు. నగరంలోని 60 శాఖల స్వయం సేవకులు ఒక్కచోట కు చేరుకునే అద్భుతమైన కార్యక్రమం అన్నారు. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఉదయం 7.15 గంటలకు ఉంటుందన్నారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా సహ ప్రాంత ప్రచార కల్పగురి ప్రభు కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు కావున నగరంలోని అన్ని శాఖల సమయం సేవకులు సమయానికి హాజరుకావాలని కోరారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2 | నిజామాబాద్/కామారెడ్డి
శనివారం
28.2.2026
www.aksharatoday.in
AKSHARA TODAY

## కుట్టుమిషన్లు ఉచితంగా అందజేయాలి



**అక్షరటుడే, గాంధారి:** కులవృత్తి నిర్వహిస్తున్న మేరు కులస్థులకు కుట్టుమిషన్లను ఉచితంగా అందించాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గాంధారి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రేణుకచవాన్‌కు వినితపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ను స్టిచింగ్ చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరారు. దివ్యాంగులకు సైకిళ్లు అందజేయాలని, వితంతువులకు, 60 ఏళ్లు దాటిన వారికి పింఛన్ సౌలభ్యం కల్పించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో మేరు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని నేరెల్ తండా వద్ద హనుమాన్ మందిరం ఆలయం వద్ద కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ కందులు పండించిన రైతన్నలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో ఉన్నటువంటి గొప్పతనాన్ని వివరించారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో ప్రత్యేకతలను, నైపుణ్యాలను, వివరించి విద్యార్థులు కూడా పరిశోధనల వైపు వెళ్లి మంచి భవిష్యత్తును పొందాల్సిందిగా తెలిపారు. విజ్ఞాన దినోత్సవ సందర్భంగా విద్యార్థులు ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థి అరుణ్ కుమార్ సెన్సార్ ద్వారా కళ్లు లేని వారు ఈ సెన్సార్ అద్దాలను ఉపయోగించడంతో ముందు అడ్డుగా వచ్చే వస్తువులు తెలుసుకునే విధంగా అద్దాలను తయారు చేశారు. ఇందుకు గాను కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులందరినీ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, ఐకేపీ సమన్వయకర్త శంకరయ్య, ఎన్ఎస్ఎస్ విభాగం అధిపతులు చంద్రకాంత్, రాణి, గోదావరి, గంగారెడ్డి, సిద్దు రాజు, శశిధర్, సంతోష్, సురేష్ రెడ్డి, సంగీత, కీర్తి స్వప్న, దశరథ్, మహమూద్, అధ్యాపకేతరులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా గుండెపోట్లు పెరిగాయి. యువత, చిన్నారులు సైతం గుండెపోటుతో చనిపోతున్నారు. పాఠశాలలో ఆడుకుంటూ, పాఠాలు వింటూ గతంలో పలువురు విద్యార్థులు కుప్పకూలారు. ఈ క్రమంలో చిన్నారుల్లో హార్ట్ ఎటాక్‌కు కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలపై కథనం..

–అక్షరటుడే, ఇందూరు

# అప్రమత్తతే శ్రీరామ రక్ష

■ చిన్నారుల్లో గుండె సమస్యలు.. లక్షణాలు ■ అప్పుడప్పుడు పరీక్షలు చేయించాలంటున్న వైద్యులు

రాజస్థాన్‌లో ఇటీవల తొమ్మిదేళ్ల బాలిక గుండెపోటుతో మృతి చెందింది. ఐదో తరగతి చదవుతున్న చిన్నారి పాఠశాల మైదానంలో ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే పాఠశాల సిబ్బంది బాలికను ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన ఫిబ్రవరి 23న చోటు చేసుకుంది. సదరు బాలిక సోదరుడు సైతం ఇదే విధంగా మరణించడం గమనార్హం. ఇటీవల చిన్నారుల్లో గుండెపోట్లు పెరగడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో పిల్లల్లో హార్ట్ ఎటాక్ కారణాలు, లక్షణాలను వైద్యులు వివరించారు.

### పుట్టుకతో..

పిల్లల్లో గుండె ఒక్కసారిగా ఆగిపోవడం, హృదయ సంబంధ పరిమితుల కారణంగా జబ్బులు రావడం చాలా ప్రమాదకర పరిస్థితిగా వైద్యులు పేర్కొంటున్నారు. దీనిని సడెన్ కార్డియాక్ అరెస్ట్ అని పిలుస్తారు. కొందరు పిల్లల్లో పుట్టుకతో గుండె సంబంధ సమస్యలు ఉంటాయి. అయితే వాటి గురించి తల్లిదండ్రులకు తెలియకపోవడంతో పిల్లలు హార్ట్‌ఎటాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. గుండె నాళాల పరిమాణం తక్కువగా ఉంటే వంటివి రక్త ప్రవాహాన్ని అడ్డుకునే అవకాశం ఉంటుంది. గుండె రక్తం పంపింగ్ చేసే వేగం కొందరిలో ఒక్కొసారి మారిపోతు ఉంటుంది. ఇది కూడా కార్డియాక్ అరెస్ట్‌కు కారణమవుతుంది.

### వాపు రావడంతో..

వైరల్ ఇన్ఫెక్షన్ ఫ్లూ, డెంగీ వంటి వ్యాధులతో గుండె కండరాల్లో వాపు వచ్చే అవకాశం ఉంది. ఇవి గుండె పనితీరులో మార్పులు తెస్తాయి. అలాగే శరీరానికి గట్టిగ దెబ్బలు తగలడం, ఊపిరితిత్తుల వ్యవస్థలో ఇబ్బందులు కూడా హార్ట్ ఎటాక్‌లకు కారణం అవుతాయి. సాధారణంగా పిల్లల్లో సడెన్ కార్డియాక్ అరెస్ట్ అరుదుగా వస్తుంది. అది వస్తే మాత్రం ప్రమాదకరంగా ఉంటుంది.

### లక్షణాలు

పిల్లలో సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. శరీరం బలహీనంగా ఉంటుంది. వెంటనే అలసిపోతారు. కాళ్లు, చేతుల్లో వాపు వస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి. వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైద్యులు పలు రకాల పరీక్షలు చేసి గుండె సమస్యలను గుర్తిస్తారు. ఈసీజీ, ఎకో టూడీ, రక్తంలో ఆక్సీజన్ స్థాయి చెక్ చేస్తారు. అవసరం అయితే కార్డియాక్ ఎంఆర్ఐ, సిటీ స్కాన్ కూడా చేస్తారు. పిల్లలు గుండెపోటుకు గురైతే వెంటనే సీపీఆర్ చేయాలి.

### జాగ్రత్తలు తీసుకోవాలి



పిల్లల్లో గుండె సంబంధ సమస్యలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. అప్పుడప్పుడు పిడియాట్రిక్ చెకప్‌లతో పాటు కార్డియాలజీ పరీక్షలు చేయించాలి. కుటుంబంలో ఎవరికైనా గుండె సంబంధ సమస్యలు ఉంటే వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి ఆహారం, క్రీడలు, మంచి నిద్ర హృదయ ఆరోగ్యానికి అవసరం.

– డాక్టర్ సందీప్‌రావు, గుండె వైద్య నిపుణులు

## కుమ్మెర ఘటనలో బాధితులకు న్యాయం చేయాలి



**అక్షరటుడే, కోటగిరి:** కుమ్మెర ఘటనలో బాధితులకు న్యాయం చేయాలని రజక ఐక్య వేదిక కోటగిరి ఉమ్మడి మండలం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్, ఐలమ్మ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి మండలాల అధ్యక్షుడు ప్యాట్ల పెంటయ్య, కోటగిరి గ్రామ ఉపాధ్యక్షుడు శీను మాట్లాడుతూ.. కుమ్మెర గ్రామం మల్లన్న జాతరలో రజక కుటుంబానికి జరిగిన అన్యాయానికి యావత్‌తెలంగాణ నిరసన తెలుపుతోందన్నారు. జిల్లా గౌరవ ఉపాధ్యక్షుడు సంగం రమేష్, ఉమ్మడి మండలాల రజక సంఘం నాయకులు, సంగం నారాయణ, రమేష్, రాజారాం, యదు, సుధాకర్, మేత్రి సత్య నారాయణ, గజేందర్, గంగాధర్, బాలయ్య, నాగరాజు, రవి, రాజు పాల్గొన్నారు.

## మైనర్‌పై వేధింపులు..

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని ఓ పాఠశాలలో బాలికపై లైంగిక వేధింపుల ఘటన కలకలం సృష్టించింది. ఈ మేరకు స్పందించిన పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాల్కొండ ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పాఠశాలలో చదువుతున్న ఓ బాలికపై ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాలిక తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన ఎస్సై సుహాసినిపాఠశాలలో విచారణ చేసిన అనంతరం సదరు ఎలక్ట్రీషియన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## విద్యుత్ తీగలపై పిచ్చిమొక్కల తొలగింపు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో ప్రియా టాకీస్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. ఈ సమస్యను కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్ విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం విద్యుత్ లైన్‌మన్ శశికాంత్ రెడ్డి జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలు తొలగింపజేశారు. విరిగిపోయిన కరెంటు స్తంభాలను సరిచేసి, కొత్తవైర్లతో విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, కాలభైరవ స్వామి గుడి చైర్మన్ చింతల శంకర్, పాషా, నారాయణ, మల్లేష్, సుజిత్, జక్కుల సంతోష్, విద్యుత్ సిబ్బంది అరుణ్, ప్రేమ్, సంతోష్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ఎనిమిది, తొమ్మిది వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ పాలక వర్గం ప్రారంభించింది. మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ నేతృత్వంలో 8వ వార్డు కౌన్సిలర్ సిద్ది శ్రీధర్‌తో రోడ్డు నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. రామ్ గారి దత్తు ఇంటి నుంచి ముప్పిడి గుండయ్య ఇంటివరకు గల సీసీరోడ్డు ధ్వంసం కాగా.. మళ్లీ సీసీ రోడ్డు పనులను ప్రారంభించింది. సుమారు రూ.50లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పాలకవర్గం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ సిద్ది శ్రీధర్ గుప్తా, తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ గాదే తిరుపతి, ఆరో వార్డు కౌన్సిలర్ సయ్యద్ గఫర్, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు కిషన్, రాచకొండ రవీందర్, పాపయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నాయక్‌పోడ్ కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే, బోధన్:** నిరుపేద నాయక్‌పోడ్ కుటుంబానికి 'నేనుసైతం నాయక్‌పోడ్ చేయూతకై..' ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. నవీపేట్ మండలం పోతంగల్‌లో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని నాయక్‌పోడ్ కులస్థుడైన మేకల పోశెట్టి ఇటీవల మృతి చెందాడు. ఆయనకు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో స్పందించిన జిల్లా 'నేను సైతం నాయక్‌పోడ్ చేయూతకై..' ఫౌండేషన్ సోషల్ మీడియా ద్వారా విరాళాలు సేకరించారు. రూ. 30వేల వరకు విరాళాల సేకరించారు. మృతుడు మేకల పోశెట్టి కూతురు స్పందన పేరుపై రూ.25వేల వరకు ఫిక్సడ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నిజామాబాద్ నాయక్‌పోడ్ అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, పోలీస్ రాజేశ్వర్ నవీపేట్ మండల అధ్యక్షుడు గొంటి రాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి మేకల సాయిరాం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



మాణిక్‌భవన్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో..



ఆర్మూర్‌లో స్మైల్ ది స్కూల్ పాఠశాలలో..



బాలనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28వ తేదీన రామన్ ఎఫెక్ట్ కనుగొనడంతో ఆ రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని సూచించారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్





నగరంలోని ఇంద్రాణి పాఠశాలలో..



బాల్కొండ మండలంలోని పీఎంశ్రీ పాఠశాలలో..



శెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



బాన్సువాడ పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో..

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా..




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారారు. తోటి విద్యార్థులకు విద్యాబోధన చేసి అలరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గండిమాసానిపేట్‌లో పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. హెచ్ఎంగా శ్రీతేజ్, ఉపాధ్యాయులుగా మమత, సరోజ, మదన్, సందీప్, పీఈటీలుగా శాలింరాజు, భూలి, అటెండర్‌గా సాయి గణేష్ వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం రాజులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, సుభాష్, సాయిలు, మురళి, శివలింగం, సంజీవులు, రాధిక, ఆనంద్ పాల్గొన్నారు.

## తల్లిని సజీవదహనం చేసిన కసాయి

**అక్షరటుడే, కోటగిరి :** మానవత్వం మంటగలుస్తోంది. కన్న తల్లిపైనే కసాయి కొడుకు తన కర్కశత్వం చూపాడు. నవమాసాలు కనిపెంచిన తల్లిని దారుణంగా హింసించి కల్లుసీసాతో దాడిచేసి అనంతరం సజీవదహనం చేశాడు. ఈ హృదయ విదారక ఘటన కోటగిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ చెత్త సామాన్లు సేకరించే వ్యక్తి తన తల్లితో నివాసముంటున్నాడు. మద్యానికి బానిసైన ఆ వ్యక్తి నిత్యం డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. ఇటీవల ఆమెకు పింఛన్ డబ్బులు రాగా.. వాటికోసం గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి విపరీతమైన మద్యం మత్తులో తల్లిపై దాడికి పాల్పడ్డాడు. సీసాతో తలపై కొట్టగా ఆమె స్పృహ కోల్పోయింది. అనంతరం ఆమెపై పాతదుస్తులు వేసి నిప్పంటించి సజీవ దహనం చేశాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.